క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

చోడవరం రూరల్: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ సాధారణ నిర్వహణ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



మాట్లాడుతున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: కిశోర బాలికలు, మహిళలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్య గుర్తించేందుకు సచివాలయాల వారీగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చౌడువాడ, లంకవానిపాలెం పీహెచ్‌సీల వైద్యాధికారులు సుబ్రహ్మణ్యం, శైలజ సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చునని తెలిపారు. రక్తహీనత బాధితులకు మందులతోపాటు ఆరోగ్య సూచనలు చేయనున్నట్లు వివరించారు. ఎంపీడీవో శచీదేవి, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఎంపీహెచ్ ఈవో కె.వి.రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడిగా జగదీశ్

మాడుగుల రూరల్: బీజేపీ యువ మోర్చా మండలాధ్యక్షుడిగా కె.జె.పురం గ్రామాధ్యక్షుడు జగదీష్ నియమితులయ్యారు. ఈ మేరకు యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు గేదేల స్వరూప్ గురువారం నియామక పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుట్టా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు సాలాపు వీరునాయుడు హర్షం వ్యక్తం చేశారు.

నేడు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

నర్సీపట్నం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, ఆయా పోస్టులకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో మేరీ సువార్త తెలిపారు. కాల్ లెటర్‌లో పొందుపరిచిన సమయానికి అభ్యర్థులు విధిగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

హనుమాన్ ఆలయ నిర్మాణం కోసం నిరసన దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న కామేష్

మాకవరపాలెం: అసంపూర్తిగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని పూర్తి చేయాలంటూ ఒక యువకుడు నిరసన దీక్ష చేపట్టాడు. రాచపల్లి గ్రామంలోని గెడ్డ పక్కనే గతంలో ఆంజనేయస్వామి ఆలయం నిర్మించారు. తుపాను వర్షాలకు గెడ్డ ప్రవాహంలో ఈ ఆలయం కొట్టుకుపోయింది. అనంతరం ఆలయాన్ని పునర్నిర్మించేందుకు పనులు ప్రారంభించి శ్లాబు వేసి వదిలేశారు. ఈ నేపథ్యంలో ఆలయం నిర్మాణం పూర్తి చేయాలనే డిమాండ్‌తో గ్రామానికి చెందిన లాలం కామేష్ గురువారం నిరసన దీక్ష ప్రారంభించాడు. కామేష్‌కు కొంత మంది గ్రామస్తులు మద్దతుగా నిలిచారు.

కె.జె.పురం క్రికెట్ జట్టుకు అభినందన



తృతీయ స్థానం సాధించిన కె.జె.పురం యువకులు

మాడుగుల రూరల్: గాదిరాయిలో నిర్వహించిన నాయుడు క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో కె.జె.పురం క్రికెట్ జట్టు తృతీయ స్థానం సాధించింది. ఇటీవల ఈ టోర్నమెంట్‌కు మాడుగుల, చోడవరం, నియోజకవర్గాల పరిధిలోని 32 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఇందులో కె.జె.పురం టీమ్‌కు తృతీయ స్థానం దక్కింది. ఈ జట్టును సర్పంచ్, గ్రామపెద్దలు అభినందించారు.

నిరుపేదలకు న్యాయమే జగనన్న ఆశయం

- గడప గడపకు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



వి.బి.పేటలో దివ్యాంగ అన్నాచెల్లెళ్లతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: గిరిపుత్రులకు, నిరుపేదలకు సత్వర న్యాయం అందించడమే జగనన్న ఆశయమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం వి.బి.పేట పంచాయతీలో వి.బి.పేటతో పాటు శివారు కొండేంపూడి, గొప్పూరు, ముడిచర్ల, జై పురం గిరిజన గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వి.బి.పేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి 410 కుటుంబాలను ఆయన కలిశారు. సంక్షేమ పథకాల అందుతున్న తీరుపై ఆరా తీశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు నీటి, సీసీరోడ్ల సమస్యల పరిష్కారానికి తక్షణమే ప్రతిపాదనలు అందించాలని మండల ఇంజినీర్ పరదేశినాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌లను ఆదేశించారు. పోడు భూములకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందించాలని కోరగా, వీటిని పరిశీలించి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కోటి రూపాయలతో వి.బి.పేట, జైపురం, గొప్పూరు, ముడిచర్లలో ఇంటింటా కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు.

వి.బి.పేటలో అంగన్‌వాడీ భవనం ప్రారంభం

వి.బి.పేటలో రూ. 8.50 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని బూడి ప్రారంభించారు. శిథిలమైన వి.బి.పేట, గొప్పూరు పాఠశాలల నూతన భవనాల నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. వి.బి.పేటలో అచేతన రోగి శిమ్మి దేముడుకు డీఎంహెచ్‌వో ద్వారా రూ. 5 వేల పింఛన్ మంజూరుకు పరిశీలించాలన్నారు. గొప్పూరులో ప్రమాదంలో గాయపడి మానసిక రోగిగా మారిన చిన్నారికి రూ.2 వేలు అందించి మెరుగైన వైద్య సేవలు అందించాలని, పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వి.బి.పేట నుంచి గొప్పూరు, కొండేంపూడి గ్రామాలకు తారురోడ్లు నిర్మించాలని గిరిజనులు కోరారు. ఇప్పటికే ఎంపీ సత్యవతి ద్వారా కేంద్రమంత్రికి లేఖ ఇచ్చామని, త్వరలో నిధులు మంజూరు కాగానే రోడ్డు నిర్మిస్తామన్నారు. తహసీల్దార్ బి.వి. రాణి, ఎంపీడీవో జయప్రకాష్, ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వి.బి.పేట సర్పంచ్ వంటాకు నర్సింహమూర్తి, ఎంపీటీసీ ఈర్లి దేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, శిరిజాం సర్పంచ్ కన్నూరి చెల్లంనాయుడు, పోతల రమణ, పి.సతీష్‌వర్మ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే 'గడప గడపకు'

- నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



యరకన్నపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంలో గ్రామాల్లో పర్యటిస్తున్నట్టు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తెలిపారు. మండలంలోని యరకన్నపాలెం, ధర్మవరంలో గురువారం నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఏ ఇంటికి ఎంతమేర పథకాల రూపంలో లబ్ధి చేకూర్చిందో వివరించారు. వారి పేరున ముద్రించిన బ్రోచర్లను పంపిణీ చేశారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలపైనా ఆరా తీశారు. యరకన్నపాలెంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కొంతమంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అర్హులకు పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు చిటికెల రమణ, నాయకులు భద్రాచలం, దొరబాబు, పిల్లా శ్రీను, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల పరుగు పందెం

- ఆర్.భీమవరంలో చిడతలు, తప్పెటగుళ్ల పోటీలు



మాడుగుల రూరల్: ఆలయం ఎదుట తోడపెద్దు గరిడి సేవ చేస్తున్న దృశ్యం



బుచ్చెయ్యపేట: ఆర్.భీమవరం తీర్థంలో పాల్గొన్న ప్రజలు



హుషారుగా పరుగులు తీస్తున్న ఎద్దులు

బుచ్చెయ్యపేట: ఆర్.భీమవరంలో రామాలయ తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గులు, ఎడ్ల పరుగు పందెం, చిడతలు, తప్పెటగుళ్లు, కుర్చీల పోటీలు ఆకట్టుకున్నాయి. చిన భీమవరం, ఎం.బి.పాలెం, మల్లాం, శివరాంపురం తదితర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పండగ వాతావరణం నెలకొంది. పలు ఆటల పోటీల్లో విజేతలకు ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా సీతారాములోరి తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో సీతారాములోరి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతోపాటు దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయం వద్ద స్వామివారి చెట్టు భజన వద్ద పూజలు చేశారు. తోడపెద్దు సేవ నిర్వహించారు. అదే రోజు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రెండు గ్రామాల్లో తీర్థాలు

కె.కోటపాడు: మండలంలోని సూరెడ్డిపాలెంలో దుర్గాలమ్మ, కె.సంతపాలెంలో నాగదుర్గాలమ్మ అమ్మవార్ల తీర్థాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామాల్లో భక్తులు ఉదయం నుంచే అమ్మవార్ల ఆలయాల్లో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదేరోజు రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

రోలుగుంట: బల్జిపాలెం సీతారాములోరి తీర్థం ఘనంగా నిర్వహించారు. రామాలయంలో సర్పంచ్ మామిడి అప్పలనర్స దంపతులు పూజలు చేశారు. కుసుర్లపూడిలో బుధవారం సీతారాముల ఉత్సవాన్ని, గురువారం గౌరీపరమ్వేరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఉత్సవ మూర్తులను వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, సర్పంచ్ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎస్. పెద్దినాయుడు, జెడ్పీహెచ్ స్కూల్ పీఎంసీ చైర్మన్ జి.రాజబాబు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

డి.గొటివాడలో..

మాడుగుల: డి.గొటివాడలో రాముల వారి తీర్థం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి క్రికెట్, సైకిల్ స్పీడ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రతినెలా గ్రామసభల్లో అవగాహన



శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో ప్రభాకరరావు, వైద్యాధికారి ధనలక్ష్మి

రోలుగుంట: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్య, సచివాలయ సిబ్బందికి రక్తహీనత గుర్తింపు, నివారణపై గురువారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రధానంగా సిబ్బంది పది నుంచి 19 ఏళ్లలోపు రక్తహీనత బాలికలను గుర్తించి వారు సంపూర్ణ ఆహారం తీసుకునేలా సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. ప్రధానంగా ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ సిబ్బంది బృందంగా ప్రతి నెలా మూడు గ్రామ సభలు నిర్వహించి పై వయసు వారిని చైతన్యపరచాలన్నారు. కౌమార దశలో వచ్చే మార్పులపైన, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై వైద్యాధికారి ధనలక్ష్మి అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఖండివరం–వి.బి.పేట తారురోడ్డు ప్రారంభం



ఖండివరం-వి.బి.పేట తారురోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బూడి

చీడికాడ: రాష్ట్రంలో రహదారి సమస్యతో ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదన్నదే సీఎం జగనన్న లక్ష్యమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఖండివరంలో రూ.35 లక్షలతో నిర్మించిన ఖండివరం– వి.బి.పేటల మధ్య తారురోడ్డును గురువారం ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ రోడ్డును ఖండివరం మధ్య నుంచి చోడవరం, కోనాం రోడ్డుకు వరకు పొడిగించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ సందర్భంగా కోరారు. దీనికి స్పందించిన బూడి సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని మండల ఇంజినీర్‌ను ఆదేశించారు. ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, ఖండివరం ఎంపీటీసీ గెంజి స్వాతిబాలాజీ, డైయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, చీడికాడ పీఏసీఎస్ అధ్యక్షుడు మోసూరి సన్నిబాబు, వి.బి.పేట సర్పంచ్ వంటాకు నర్సింహమూర్తి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సతీష్‌వర్మ, సుంకర శ్రీను, పోతల రమణ, సుంకర వెంకటరావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు హెల్ప్ డెస్క్

చోడవరం రూరల్: పట్టణ కేంద్రానికి ఈ నెల 21న కానిస్టేబుల్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ కాంప్లెక్సులో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్టు సీఐ బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. కొత్తూరు జంక్షన్‌లో ఉషోదయ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, వ్యాపార వీధిలోని శ్రీసాయిప్రకాష్ డిగ్రీ కాలేజీ, విద్యార్థి డిగ్రీ కళాశాల, కోఆపరేటివ్ కాలనీలోని షిర్డీ సాయి శ్రీనివాస (4ఎస్) డిగ్రీ కాలేజీ పరీక్ష కేంద్రాల్లో 1,810 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. వీటి చిరునామాలను తెలపడానికి హెల్ప్ డెస్క్ ఉపకరిస్తుందన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం కానుందని, ఆలోపే పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు చేరుకోవాలన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. సెల్ ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు, బ్లూటూత్ వంటి ఇతర గ్యాడ్జెట్లు పరీక్ష కేంద్రంలోని అనుమతింబోమని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురికి మించి గుమికూడినట్టయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

8 మంది పందెంరాయుళ్ల అరెస్టు

చోడవరం రూరల్: ముందస్తుగా అందిన సమాచారం మేరకు ముద్దుర్తిలో ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. చోడవరం ఎస్ఐ బి.అప్పలనాయుడు తమ సిబ్బందితో గ్రామ శివారులోని కళ్లం పాకల వద్ద పేకాడుతున్న వారిపై దాడి చేశారన్నారు. వీరి నుంచి రూ.7,560 స్వాధీనం చేసుకున్నారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ముద్దుర్తి రామాలయం వద్ద బహిరంగ ప్రదేశంలో బల్లాట ఆడుతుండగా ఎస్ఐ అప్పలనాయుడు తమ సిబ్బందితో దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.3,300 స్వాధీనం చేసుకున్నారని సీఐ పేర్కొన్నారు.

రైతులు సహకరిస్తే రీసర్వే వేగవంతం

- స్పందన అర్జీలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తాం
- నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరాం



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమంత వెంకట జయరాం

నాతవరం: గ్రామాల్లో రైతులంతా ఐక్యతగా సహకరిస్తే సమగ్ర భూ రీసర్వే వేగవంతమవుతుందని నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరాం తెలిపారు. మండలంలోని జిల్లేడుపూడి పంచాయతీ శివారు రైతు వెంకయ్యపాలెంలో నాడు – నేడు నిధులతో నిర్మిస్తున్న పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో చేసిన భూ సర్వే ఆధారంగానే ప్రస్తుతం రెవెన్యూ వ్యవస్థ నడుస్తుందన్నారు. జగనన్న భూ రీసర్వే సకాలంలో పూర్తయితే భూముల సరిహద్దు తగాదాలు శాశ్వతంగా పరిష్కారమవుతాయన్నారు. ఆధునిక సాంకేతిక యంత్రాలతో ఎలాంటి అవకతవకలు తావివ్వకుండా రైతులు సమక్షంలో సర్వే చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు డివిజన్‌లో అటవీ హక్కు చట్టం ప్రకారం అర్హులైన గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పత్రాలు ఇవ్వడానికి దృష్టి సారిస్తానన్నారు. అమృత్ సరోవర్ పథకంలో చెరువుల ఆక్రమణలను తొలగిస్తామన్నారు. సచివాలయాల ద్వారా రైతులకు అవసరమైన రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తాన్నారు. భూ సంబంధిత విషయాల్లో రైతులను రెవెన్యూ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. స్పందన అర్జీలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తానన్నారు. తహసీల్దార్ పి.కనకారావు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్ఐలు మధు, నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలం కాపాడేందుకు కృషి



సమావేశంలో సర్పంచ్ మంగ, గ్రామ పెద్దలు

కె.కోటపాడు: కె.సంతపాలెం గ్రామ పంచాయతీలో సర్వే నంబర్లు 127–67, 118–21, 126–27లో రెండెకరాల భూమిని ఆక్రమించుకునేందుకు గ్రామానికి చెందిన కొంతమంది జేసీబీలతో పనులు చేస్తుంటే, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అడ్డుకున్నామని సర్పంచ్ చల్లా మంగ తెలిపారు. దీన్ని అడ్డుకున్నందుకు అక్కసుతో తనపై సదరు వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. గురువారం ఆమె గ్రామ పెద్దలతో మాట్లాడారు. ఇదే స్థలాన్ని 2016లో కె.కోటపాడు జూనియర్ కళాశాల భవనాలకు, రైతు బజారు కోల్డ్ స్టోరేజీ యూనిట్‌కు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు అంగీకరించారని వివరించారు. ఇదే భూమిలో ఇటీవల నవరత్నాలు–పేదలకు ఇళ్ల పథకంలో 21 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలను ఇచ్చారని, మరికొందరికి ఇవ్వాల్సిందిగా రెవెన్యూ అధికారులను కోరినట్లు తెలిపారు. వార్డు మెంబర్లు సిహెచ్.వి.రమణ, గంగాభవాని, భర్ల కృష్ణవేణి, చల్లా గోవిందు, రామునాయుడు పాల్గొన్నారు.

బోన్‌మేరో బాధితుడికి ఆర్థిక సాయం



నీరజ్ తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న సంస్థ సభ్యులు

రావికమతం: బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న కొత్తకోట హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి గ్రటిడ్డి నీరజ్ వైద్య ఖర్చుల నిమిత్తం విశాఖకు చెందిన స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ రూ.12 వేలు గురువారం అందించింది. పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించి ఆ సంస్థ సభ్యులు ఈ సాయం చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న నీరజ్‌కు రక్త మార్పిడి చేయాల్సి ఉంది. దీనికి రూ.30 లక్షలు ఖర్చవుతుంది. ఇటీవల నర్సీపట్నం వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిని కలవగా నీరజ్‌కు ఆపరేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయల చెక్కు అందించారు. ఇప్పటి వరకూ అప్పులు చేసి వైద్యం చేయించుకున్న ఆ కుటుంబం ఆర్థికంగా చిదిగిపోవడంతో పలువురు దాతలు ముందుకొచ్చి సాయమందిస్తున్నారు.

12 మద్యం సీసాలతో నిందితుడి అరెస్టు

చోడవరం రూరల్: ఎటువంటి లైసెన్సు లేకుండా అధికంగా మద్యం సీసాలు కలిగిఉన్న నిందితుడిని ఎస్ఐ బి.అప్పలనాయుడు గురువారం అరెస్టు చేశారు. అంకుపాలెం రోడ్డు సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద 12 క్వార్టర్ సీసాలతో ఉన్న జన్నవరం గ్రామానికి చెందిన సాలాపు శ్రీనును అరెస్టు చేశారు. అతడి నుంచి వీటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



డి.యర్రవరం సచివాలయంలో పరిశీలిస్తున్న ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు

నాతవరం: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు హెచ్చరించారు. మండలంలో డి.యర్రవరం, ఎం.బెన్నవరం గ్రామ సచివాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీటి ద్వారా ప్రజలకు ఏవిధంగా సేవలందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్లో పెండింగ్ సమస్యలను స్వయంగా పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీరు బోర్లను పరిశీలించి యుద్ధప్రాతిపదికన బాగు చేయించారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇల్లు నిర్మించుకుంటే సకాలంలో బిల్లులు చెల్లిస్తామన్నారు. మండల వ్యాప్తంగా ఇంతవరకు 400పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామని, మరో 758 ఇళ్ల పనులు వివిధ దశలో ఉన్నాయన్నారు. గడువులోపు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే రద్దు చేస్తామన్నారు. డి.యర్రవరంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనులు పరిశీలించి వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు కె. శ్రీనివాస్, సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

మునగపాక : బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, వెలుగు సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే 10 నుంచి 19 సంవత్సరాల బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన ఇవ్వాలన్నారు. వారిలో వచ్చే మార్పులను గమనిస్తూ ఉండాలన్నారు. మహిళల్లో రక్తహీనత కారణంగా ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఇందుకోసం వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించాలన్నారు. డీసీవో లిఖిత, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, తహసీల్దార్ బాబ్జీ, చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి పాల్గొన్నారు.

భూమిలో కలియదున్నితే ఎన్నో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న రామలక్ష్మి

రావికమతం: తొలకరి వర్షాల సమయంలో 18 రకాల నవ ధాన్యాలు, చిరుధాన్య విత్తనాలు భూమిలో చల్లి కలియ దున్నితే సేంద్రియ పదార్థంగా భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మండల టెక్నీషియన్ రామలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె దొండపూడి గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. దీని వల్ల ఎరువుల వాడకం తగ్గడమేగాక పంటలకు తెగుళ్లు దరిచేరవని, రైతులకు అదనపు ఆదాయం ఆరోగ్యమని వివరించారు. ఉప సర్పంచి రాజారావు, రైతులు గర్రెడ్డి తాతబాబు, అబ్బాయి రమణ, రామునాయుడు, పరదేశి, చినబాబు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది గంగరాజు, గుణావతి పాల్గొన్నారు.

సభ దృష్టికి వచ్చిన గ్రామ సమస్యలకు పరిష్కారం

- సర్వసభ్య సమావేశంలో రావికమతం ఎంపీపీ పైలరాజు



మాట్లాడుతున్న ఎంపీపీ పైల రాజు

రావికమతం: గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి సభలో సభ్యులు ప్రస్తావిస్తే పరిష్కారం లభిస్తుందని ఎంపీపీ పైల రాజు అన్నారు. ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలు ఎంత వరకూ పరిష్కారమయ్యాయని గుమ్మాళ్లపాడు, గంపవానిపాలెం, గుడ్డిప, కవగుంట సర్పంచ్‌లు ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంలో పంట కాలువల పూడికతీతకు అవకాశం కల్పించాలని పలు సమస్యలు లేవనెత్తగా, వాటికి తగిన పరిష్కారం చూపామని ఎంపీడీవో వెంకన్నబాబు సమాధానమిచ్చారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే సభ దృష్టికి తేవాలని ఎంపీపీ సూచించారు. సొంత స్థలదారులకు ఇళ్లు మంజూరు కోసం ఇకపై సచివాలయంలో నమోదు చేసుకోవచ్చన్నారు. వచ్చే ఉగాదికి మండలంలో 430 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు హౌసింగ్ ఏఈ రామచంద్రావు తెలిపారు. 29 గ్రామ సచివాలయాలకు గానూ కొత్తకోట మినహా మిగిలిన గ్రామాల్లో నిర్మాణం త్వరితగతిన చేస్తున్నట్లు పీఆర్ జేఈ సుమతి తెలిపారు. మొదటి విడతగా 11 గ్రామాల్లో రీసర్వే పూర్తి కాగా, రెండో విడతగా 8 గ్రామాల్లో ప్రారంభించామని డిప్యూటీ తహసీల్దార్ శేషు వివరించారు. కల్యాణపులోవ రిజర్వాయర్ కాలువ పూడికతీత పనులకు నిధులు సమృద్ధిగా లేనందున ఉపాధి హామీ పథకంలో చేర్చాలని ఏఈ సత్యనారాయణ దొర సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ విప్ ధర్మశ్రీ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని చోడవరం ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు సూచించారు. వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, మత్స భవానీప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, తహసీల్దార్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

సత్యవరం సచివాలయాన్ని పరిశీలించిన ఎంపీడీవో

మాడుగుల: సత్యవరం గ్రామ సచివాలయాన్ని గురువారం ఉదయం ఎంపీడీవో మీనాకుమారి పరిశీలించారు. ఇక్కడ కంప్యూటర్లు, రికార్డులు, ఇన్వెంటర్ షార్ట్‌సర్క్యూట్‌తో బుధవారం రాత్రి కాలి బూడిదయిన విషయం తెలిసిందే. వీటిని పరిశీలించిన ఆమె మాట్లాడుతూ గ్రామస్తులు సమాచారం, ఫైర్ అధికారుల రిపోర్టు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. వీలైనంత త్వరగా కంప్యూటర్లు అందజేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతుల నాగమణిరామారావు, పంచాయతీ కార్యదర్శి విశాలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ శనివాడ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు గోకేడ ఈశ్వరరావు, జాజుల ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.